క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి హోమం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని తిరుమలహిల్స్‌లో ఉన్న త్రినేత్ర దశభుజ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మార్గశిర శుద్ధపౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించిన హోమంలో రిషి విద్యాసంస్థల డైరెక్టర్ చంద్రకళావెంకటయ్య దంపతులు పాల్గొనగా.. వెంకట శేషాచార్యులు ప్రవచనం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రవీందర్, కౌన్సిలర్ రామాంజనేయులు, ఆలయ ధర్మకర్త సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, సంపత్‌కుమార్, కె.సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, జగన్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు



జడ్చర్ల టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈనెల 24న ప్రారంభమైన ఉత్సవాలు.. మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజున ఉదయం 6గంటలకు అభిషేకం, ప్రాభోదకి (బాలభోగం), తిరువాయిముజి సేవాకాలం పూజలను వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య జరిపించారు. సాయంత్రం మహానివేదన అనంతరం హారతి సమర్పణతో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి అయ్యాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్ రుణాలు, సరేండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీఎస్‌జీఎల్‌ఐ, ఉద్యోగ విరమణ పొందిన నాల్గోతరగతి ఉద్యోగుల బిల్లులు చెల్లించాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అవలంబించిన ఉద్యోగ వ్యతిరేక వైఖరి వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు. ఉద్యోగులకు దాదాపు రూ.వెయ్యి కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని, ఏడాది నుంచి చెల్లింపులు చేయకుండా పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఇష్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వహీద్‌షా, ఖాజాజైనుల్లా అబెదిన్, సిరాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

'వక్ఫ్ ఆస్తుల చట్టాన్ని రద్దుచేస్తే సహించం'

స్టేషన్ మహబూబ్‌నగర్: 1995 వక్ఫ్ ఆస్తుల చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తే సహించేదిలేదని సామాజిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల ఆర్థిక స్థైర్యాన్ని దెబ్బతీయాలనే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయడానికి పావులు కదుపుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. వక్ఫ్ ఆస్తుల చట్టం రద్దు ప్రతిపాదను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు దేవాదాయశాఖ మాదిరి వక్ఫ్ కమిషనరేట్ ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తులకు అన్నదానం



దేవరకద్ర: చిన్నరాజమూర్ అంజన్న ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు మంగళవారం మాజీ వైస్‌ఎంపీపీ చంద్రకళ, కాంగ్రెస్ నాయకుడు అంజన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 2వేల మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

బాలానగర్: మండలంలోని మోతీఘణపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ చంద్రశేఖర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



కుమ్మరివాడి యూపీహెచ్‌సీ వెనుక భాగంలో ఇలా..



పాత రైతుబజార్‌కు ఎదురు గల్లీలో రోడ్డుపైనే పార్కింగ్ చేసిన బైక్‌లు

సగం పాత ఇళ్లే.. చుట్టూ దుర్గంధభరితం!

- పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లు
- 'మిషన్ భగీరథ' లీకేజీలమయం

వార్డు నం.29లో జనాభా: 6,243
ప్రధాన వీధులు: మదీనా మసీదు ప్రాంతం, భారత్ టాకీస్, మార్కెట్ ఏరియా (కొంత భాగం), కుమ్మరివాడి (కొంత భాగం)

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 29వ వార్డు పరిధిలో సగం పాత ఇళ్లు, చిన్న చిన్న గల్లీలే దర్శనమిస్తాయి. పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయి. ముఖ్యంగా భారత్ టాకీస్ ప్రాంతం, మార్కెట్ ఏరియాలో వివిధ వ్యాపార, వాణిజ్య దుకాణాలు వెలిశాయి. చుట్టుపక్కల వ్యాపారులు వదిలేసిన వ్యర్థాలను తినడానికి పందులు గుంపులు గుంపులు వస్తున్నాయి. ఆపై రోడ్ల పక్కన ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం వేస్తున్నారు. మోరీలన్నీ కంపుకొడుతుండటంతో అక్కడ వివిధ వస్తువులను కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పాత రైతుబజార్‌కు ఎదురు గల్లీ వెంట పదుల సంఖ్యలో బైక్‌లు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. మదీనా మసీదు ప్రాంతంలో లో-ఓల్టేజీ సమస్య పట్టి పీడిస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి తరచూ లైన్ ట్రిప్ అవుతోందని స్థానికులు వాపోతున్నారు. త్రీఫేజ్ లైన్‌గా మారిస్తే బాగుంటుందని వారు పేర్కొంటున్నారు. కుమ్మరివాడి నుంచి అస్లాంఖాన్ గల్లీ వరకు రైల్వే ట్రాక్ పక్కన మట్టి రోడ్డే శరణ్యమైంది. దీంతోపాటు కొందరు వ్యక్తులు తమ వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలపడంతో నడవడానికి, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కుమ్మరివాడి యూపీహెచ్‌సీ వెనుక గల్లీలో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇక కుమ్మరివాడి నుంచి మదీనా మసీదు వరకు రోడ్డుపై రెండుచోట్ల ఏడాది క్రితం మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ లీకేజీ అయింది. తాగునీరు వదిలినప్పుడు రోడ్డుపై ఏరులై పారుతోంది. ఈ మార్గంలో వృథాగా ఉన్న మినీట్యాంకు, పవర్ బోరును వినియోగంలోకి తేవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైల్వే ట్రాక్ పక్కన రోడ్డుపై సన్నని కంకర వేసి వదిలేసిన తీరు..



భారత్ టాకీస్‌కు ఎదురుగా మోరీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఇనుప స్తంభాలు తొలగించాలి..



మా గల్లీలో ఉన్న రెండు ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ పోల్స్ ఏర్పాటుచేయాలి. ఆరు నెలల నుంచి వీధిదీపాలు సరిగా పని చేయడం లేదు. రైల్వే ట్రాక్ వెంట, అలాగే రోడ్డుపై కొందరు చెత్తాచెదారం వేయడంతో కుప్పలుగా పేరుకుపోతోంది. వీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 15 రోజులకోసారి మోరీలు తీసినా మురుగును ఆ వెంటనే ట్రాక్టర్‌లో తరలించడం లేదు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

– మహ్మద్ ఇఫ్తెకార్, భారత్ టాకీస్ వెనుక గల్లీ

తాగునీటిలో ఒండ్రు వస్తోంది..



మిషన్ భగీరథ పథకం ద్వారా వదిలే తాగునీటిలో ఒండ్రు కలిసి వస్తోంది. నెలకోసారి ఊడ్చడానికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులు ఇక్కడి మోరీలను సరిగా తీయరు. మా వీధిలో బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని నడవడానికీ వీలు లేకుండా ఉంది. ముఖ్యంగా విద్యుత్‌కు సంబంధించి పాత ఇనుప స్తంభాలను మార్చి కొత్తవి వేయాలి. పబ్లిక్ నల్లా పైపు విరిగిపోవడంతో రోడ్డుపై నీరు వృథాగా ఏరులై పారుతోంది. ఇన్నేళ్లయినా ఎలాంటి అభివృద్ధి జరగలేదు.

– అవంతిక రాణి, కుమ్మరివాడి

సమస్యలు ఉన్నది వాస్తవమే..



నేను అప్పట్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందాను. ఈ నాలుగేళ్లలో కేవలం రూ.37.5 లక్షలతో వివిధ పనులు పూర్తి చేయగలిగాను. ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోని విషయం వాస్తవమే. మా వార్డుకు రూ.రెండు కోట్ల మేర మంజూరు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. రైల్వేట్రాక్‌కు సమీపంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. రోడ్డు కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు.

– మహబూబ్ అలీ, కౌన్సిలర్, 29వ వార్డు

'ప్రజాపాలన'కు ప్రత్యేక బృందాలు

నవాబుపేట: అన్ని గ్రామాల్లో ఈనెల 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీలత, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. మండలంలో మొత్తం 56 గ్రామాలకు గాను ఎంపీడీఓ, తహసీల్దార్‌తో పాటు ఎంపీఓ భద్రునాయక్, ఏఓ కృష్ణకిషోర్, ఏఈ అనిల్‌కుమార్‌లతో ఐదు బృందాలను ఏర్పాటు చేశామని.. ఒక్కో టీంలో ఏడుగురు సభ్యులు ఉంటారని వివరించారు. కాగా.. ప్రతి వంద ఇళ్లకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ సముదాయంలోనే సభలు ఉంటాయని తెలిపారు.

నేడు అవగాహన సమావేశం..

గండేడ్: ప్రజాపాలన కార్యక్రమంపై బుధవారం ఉదయం 11గంటలకు గండేడ్ రైతువేదికలో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. మహమ్మదాబాద్, గండేడ్ మండలాల ప్రజాపాలన బృందాలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మిడ్జిల్: ఈనెల 28నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణకుగాను మండలస్థాయిలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలోని బృందాలు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 28న మిడ్జిల్, బోయిన్‌పల్లి, చిల్వేర్, దోనూర్, 29న వేముల, వాడ్యాల్, వల్లభ్‌రావుపల్లి, వెలుగొమ్ముల, 30న అయ్యవారిపల్లి, కొత్తూర్, మున్ననూర్, కొత్తపల్లి, జనవరి 2న భైరంపల్లి, రాణిపేట, వస్పుల, కంచన్‌పల్లి, 3న మసిగొండ్లపల్లి, ఈదులబావితండా, మల్లాపూర్, లింబ్యాతండా, 4న సింగందొడ్డి, మంగళిగడ్డతండా, చౌటకుంటతండా, పెద్దగుంట్ల తండాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాలానగర్: మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో ఈనెల 28నుంచి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో పెద్దరేవల్లి, బొడగుట్టతండా, చిన్నరేవల్లి, తిరుమలగిరి, పెద్దబాయి తండా, ఏడుగుట్టల తండా, మోదంపల్లి, అప్పాజిపల్లి, బోడజానంపేట, నమ్యతండా, పలుగుమీదితండా, మన్నెగూడ తండా, పోచమ్మగడ్డ తండాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎంపీడీఓ ఆధ్వర్యంలో చెన్నంగులగడ్డ తండా, నేలబండతండా, హేమాజీపూర్, గుండేడ్, ఉడిత్యాల, వీరన్నపల్లి, జీడిగుట్టతండా, మాచారం, సూరారం, ఈదమ్మగడ్డ తండా, చింతకుంట తండా, బిల్డింగ్ తండాలు, ఎంపీఓ విజయకుమారి ఆధ్వర్యంలో కేతిరెడ్డిపల్లి, పెద్దాయపల్లి, బాలానగర్, మోతిఘణపూర్, గంగధారిపల్లి, నేరళ్లపల్లి, ఊటకుంటతండా, జాలుగడ్డ తండా, నందారం, గౌతాపూర్, మేడిగడ్డ తండా, వాయిల్‌కుంట తండాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, విద్యార్థులు కనీస సౌకర్యాలు కరువయ్యాయని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వమైనా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు శివప్రసాద్, శివరాం, మహేష్, శంకర్ ఉన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



పరుగుపందెంలో పాల్గొన్న మహిళలు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కల్వరి ఎంబీ చర్చిలో బాక్సింగ్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో చిన్నారులు, పెద్దలకు వాలీబాల్, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించగా.. పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్, పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ బీఐ జెకబ్, కార్యదర్శి జేఐ డేవిడ్, కోశాధికారి టీఏ స్టీవెన్‌తో పాటు జే.సుహాస్, ఫిలిప్, మనోజ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మూసాపేటలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులందరికీ అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట రైతువేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 28 నుంచి అధికారులే స్వయంగా గ్రామాలకు వచ్చి ఇళ్లు, పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు వర్తించేవిధంగా కృషి చేస్తానన్నారు. అంతకుముందు కొమిరెడ్డిపల్లి గుట్ట దేవాలయం వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూప, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, సర్పంచులు సాయిరెడ్డి, చుక్కల శేఖర్, ఎంపీటీసీలు గోవర్ధన్, సంతోషి, సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, రాంచందర్, నిరంజన్, రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, పాలకుడిలా కాకుండా సేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా పార్టీలోకి ఎవరిని చేర్చుకోమని ప్రకటించారు. అనంతరం వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

యాదాద్రికి పాదయాత్ర

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన అనుప కృష్ణయ్య, ఎర్ర ఆనంద్, ఆంజనేయులు మంగళవారం యాదాద్రికి పాదయాత్ర చేపట్టారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా అనిరుధ్‌రెడ్డి విజయం సాధిస్తే.. తాము పాదయాత్రగా వస్తామని లక్ష్మీనరసింహస్వామికి మొక్కుకున్నట్లు వారు తెలిపారు. వారికి రంగారెడ్డిగూడ సర్పంచ్, ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళ పూలమాలవేసి ఆశీర్వదించారు. మాజీ ఎంపిటీసీ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ స్టేజీ సమీపంలో వెలసిన సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గోపూజ, హోమం, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. దత్త జయంతి వేడుకలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి, వేముల గ్రామాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

70ఏళ్ల నాటి భవనం నేలమట్టం



పాఠశాల భవనాన్ని తొలగిస్తున్న జేసీబీ

నవాబుపేట: మండల కేంద్రంలో 70ఏళ్ల నాటి పాఠశాల భవనం నేలమట్టమైంది. ఈ భవనంలో 1953 నుంచి పాఠశాల తరగతులు కొనసాగాయి. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన భవనం మంజూరు కావడంతో పాత భవనం తొలగించారు. కాగా.. ఈ పాఠశాలను దివంగత సీఎం బూర్గుల రామకృష్ణారావు ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా సైతం ఈ భవనం సేవలందించింది. ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో పాఠశాలగా మారింది.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన గురుస్వామి లక్ష్మీకాంత్‌రెడ్డి నివాసగృహంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప పటంపూజ, అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్, రాజశేఖర్, గోపాల్, బాల్‌రాజ్, గోవర్ధన్, శ్రీను, నాయకులు కమతం శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కేఎం నారాయణ, జితేందర్ రెడ్డి, రాంలాల్, గోపాల్, రాధారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

[illegible]

సం/- [illegible], అడ్వకేట్
ఇం.నం. 13-6-51, ఫ్లాట్ నం.101, శ్రీ సాయి దుర్గా [illegible] అపార్ట్‌మెంట్స్, గౌతమ్ నగర్ కాలనీ, [illegible], హైదరాబాద్ -500 060, సెల్: 9391344255.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ
- ఘనంగా పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవం



సీపీఐ పతాకావిష్కరణలో పాల్గొన్న పార్టీ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్రమోదీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ పిలుపునిచ్చారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం సభలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు పాడె కట్టేందుకు 1925లో ఇదే రోజున పార్టీ ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో గణనీయమైన పాత్ర పోషించిందన్నారు. అప్పట్లో భరత జాతి గడ్డ విముక్తి కోసం వేలాది మంది కమ్యూనిస్టు విప్లవ వీరులు ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గని 'ఆధార్' క్యూ..

నవాబుపేట: ఆధార్ నమోదు కేంద్రం వద్ద క్యూ తగ్గడంలేదు. ఆధార్ అప్‌గ్రేడ్ కోసం వివిధ గ్రామాల ప్రజలు నిత్యం బారులు తీరుతున్నారు. మంగళవారం సెలవు రోజు అయినప్పటికీ ఉదయం నుంచే ఆధార్ కార్డులతో క్యూకట్టారు. కాగా ఆధార్ అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా నమోదు కేంద్రాలు లేకపోవడంతోనే అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.



నవాబుపేటలో ఆధార్ సెంటర్ వద్ద క్యూలో ఉంచిన కార్డులు

వైభవంగా అంజన్న రథోత్సవం



ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలో మంగళవారం ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వందలాది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఆంజనేయ నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. చెన్నకేశవ స్వామి ఆలయం వరకు స్వామివారిని ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.